# సింగిల్ పేజీ కథలు

## నిర్ణయం

అది హైదరాబాద్‌లో చంచల్‌గూడ జైలు. మహిళా ఖైదీలందరూ లైనులో నిల్చున్నారు, భోజనం కోసం అల్యూమినియం ప్లేట్లు చేత పట్టుకొని. కొత్తగా వచ్చిన మీనాక్షి ఏడుస్తోంది.

ఖైదీలను పర్యవేక్షించే కానిస్టేబుల్ నాగమ్మ అటువైపు వస్తూ "ఏయ్! ఎవరక్కడ ఏడ్చేది.. ఏడవకు!" అంది అధికార స్వరంతో.

మీనాక్షి స్వరం కొద్దిగా తగ్గించింది. నాగమ్మ ఆమె దగ్గరికొచ్చి "ఎందుకేడుస్తున్నావ్?" అని అడిగింది, కొద్దిగా శాంతంగా.



మీనాక్షి మౌనంగా వుండిపోయింది. "నీ పేరేంటి?" అని అడిగింది నాగమ్మ.

"నా పేరు మీనాక్షి" చెప్పింది.

"నువ్వు నిన్నొచ్చిన కొత్త ఖైదీవా?" అనడిగింది నాగమ్మ.

"అవును"

"ఏం నేరం చేశావేంటి?"

"నా కూతుర్ని అమ్ముకున్నాను. ఏడాది పాప" అంది మీనాక్షి, లోగొంతుతో.

"అరె.. పిల్లని అమ్ముకున్నావా! అంత కష్టం ఏమొచ్చింది?" అడిగింది నాగమ్మ కొంచెం ఆసక్తిగా.

"మా ఆయనకి జబ్బు చేసింది. ఏ పనికీ పోలేకపోతున్నాడు. పైసల్లేక దావఖానాకి తీసుకుపోలే. నాకు ఐదుగురు పిల్లలు.." ఏడుపుగొంతుతో చెప్పింది మీనాక్షి.

"కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకోలేకపోయావా?" అడిగింది నాగమ్మ కొద్దిగా జాలిగా.

"నేను చాలాసార్లు అడిగాను ఆపరేషన్ చేయించమని. మా ఆయన కోప్పడేవాడు. కొట్టబోయేవాడు.."

"ఈ రోజుల్లో ఎవరమ్మా ఐదుగుర్ని కనేది, మీ మూర్ఖత్వంగానీ. నీ పిల్లలందరూ చిన్నవాళ్లేనా?"

"పెద్దమ్మాయికి పన్నెండేళ్లు. పెద్దింటోళ్ల ఇళ్లకి పనికి పోతాది. రెండోపిల్ల అవిటిది. తక్కిన పిల్లలు నావెంటే వుంటారు."

"సొంతిల్లు లేదా?"

"లేదు, గుడిసెల్లో కిరాయికుంటాం."

"తినడానికి తిండిలేక ఒకోరోజు సెంటర్లలో అడుక్కుంటాం. ఒకరోజు ఓ పెద్దాయన నాకు పైసలు ధర్మం చేసి, అడుక్కునేవాళ్లని పోలీసులు పట్టుకుపోతున్నారు జాగ్రత్తని చెప్పిండు. నాకు భయమేసింది. ఎందుకు పట్టుకెళతన్నారని అడిగాను. అమెరికా నుంచీ ఎవరో పెద్దమంత్రిగారు వస్తున్నారంట. ఆయన మీ దేశంలో అడుక్కునే వాళ్లున్నారా అని ఆయన ఎగతాళి చేస్తారని అన్నాడు ఆ పెద్దాయన. ఒళ్లో వున్న పిల్లని నాకియ్యి రెండు వేలిస్తానన్నాడాయన. నాకూ ఆశ పుట్టింది, మా ఆయన రోగం నయం చేసుకోవచ్చుని. పిల్లనాయనకిచ్చి రెండువేలు తీసుకున్నాను. ఆయన పిల్లని తీసుకుని వెళ్లిపోయాడు. నేను మిగతా పిల్లల్ని తీసుకుని ఇంటికెళ్లిపోయాను. ఈ విషయం మా ఆయనకి చెప్పాను. ఆయన కోపంతో మండిపడ్డాడు. నన్ను కొట్టాడు. పెద్ద పెద్దగా కేకలేశాడు. జనం పోగయ్యారు. ఈ విషయం ఎవరో పోలీసులకి తెలియజేశారు. పోలీసులొచ్చి నన్ను స్టేషనుకి తీసుకుపోయారు" అని చెప్పింది మీనాక్షి.

నాగమ్మ మౌనంగా వింటోంది. మీనాక్షి మళ్లీ చెప్పింది. "నేను జైలు నుంచి బయటికెళ్లింతర్వాత- కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయిస్తేనే నీ దగ్గరుంటా లేకపోతే నీకు విడాకులిచ్చి నా పిల్లల్ని తీసుకుని నా దారిన నే పోతానని మా ఆయనకి చెప్పాలని నిర్ణయించుకున్నాను."

"కనీసం ఇప్పుడైనా చాలా మంచి నిర్ణయం తీసుకున్నావ్" అంటూ మీనాక్షి భుజం తట్టి, అక్కడినుంచి కదిలింది కానిస్టేబుల్ నాగమ్మ.

-కొండా రామారావు (హైదరాబాద్)

***

"సీతమ్మా! నీకు ఉత్తరం వచ్చింది" అన్న పోస్ట్‌మేన్ కేకతో గుడిసె నుండి బయటకు వచ్చింది సీతమ్మ. పోస్ట్‌మేన్ ఉత్తరం చేతికందిస్తే "నాయనా! నువ్వే కాస్త చదివిపెట్టు" అంటూ బ్రతిమాలింది. పోస్ట్‌మేన్ కవరు చింపి ఉత్తరం చదివి "సీతమ్మా! మిలటరీలో ఉద్యోగం చేస్తున్న నీ కొడుకు సింహాచలం మరో పది రోజులలో ఇక్కడకి వస్తున్నా"డనే తీపి కబురు చదివి వినిపించి వెళ్ళిపోయాడు.

ఇంకా పది రోజులలో కొడుకు వస్తాడనే శుభవార్త సీతమ్మకు చాలా సంతోషాన్నిచ్చింది. ఈసారి ఎలా అయినా కొడుకును ఒప్పించి మంచి అమ్మాయిని చూసి, పెళ్ళి చేసే